అహంకారంతో హద్దులు దాటిన ఆ దుర్మార్గుడికి పట్టిన గతి?

బొడ్డ వేణుగోపాల్ కథ

# అందమైన నాగు

ఒక చేత్తో వాదస్వరం ఊదుతూ రెండోచేత్తో బుట్టమూత తీసి ముదుచుకుని వున్న నాగును తట్టాడు రంగడు.

"బుస్స్" మంటూ పైకి లేచి పడగవిప్పింది కోడెనాగు.

"అమ్మో!" అంటూ చుట్టూవున్న పిల్లలు ఒక్కడుగు వెనక్కేశారు.

"చూడు దొరా! చూడు. వయసుమీదున్న కోడెనాగు. అందమైన అసలునాగు. నిన్ననే పట్టాను. ఇంకా కోరలు కూడా తీయలేదు" చెప్తున్నాడు రంగడు వరండాలో వాలుకుర్చీలో కూర్చుని మీసాలు దువ్వుకుంటున్న రాయుడినుద్దేశించింది.

రాయుడి చూపులు కోడనాగుమీద లేవు రంగడివెనుక నిలబడివున్న వాడి పెళ్ళాం ఎంకిమీద వున్నాయి. ఏపుగా పెరిగిన వరిచేల్లా కంటికింపుగా వున్న ఆమె అందాలు రాయుడికి కనువిందు చేస్తున్నాయి.

కుడిచేత్తో చిటికవేస్తూ నాగును కవ్విస్తూ బుట్టచుట్టూ తిరుగుతున్నాడు రంగడు. కోడెనాగు బుసలు కొడుతూ అదును దొరికితే కాటేద్దామన్న కసితో తలను నలువైపులా తిప్పుతోంది. మామ చేసే విన్యాసాన్ని కన్నార్పకుండా (రోజూ చూసేదే ఐనా) చూస్తుంది ఎంకి. ఎంకికేసి కన్నార్పకుండా చూస్తున్నాడు రాయుడు.

నూలుచీరను గోచీకట్టులో బిగించివున్న ఆమె ఒంటిబిగి బంధించి వుంచిన బలిష్టమైన గుర్రాన్ని గుర్తుకు తెస్తోంది. పైట రెండు స్తనాలమధ్య చిక్కుకొని బండలమధ్య పారుతున్న నదిలా వుంది. పొట్ట పాముపొట్టలా నున్నగా ఉచ్ఛ్వాస నిశ్వాసాల మధ్య ఊగిసలా



దుతోంది. కాటుక కళ్ళు విశాలంగా తామర ల్ని గుర్తుకు తెస్తున్నాయి. మెళ్ళో పూసల దండలు పూలహారాల్లా వేలాడుతున్నాయి.

అప్రయత్నంగా నాలుకతో పెదాలు తడుపుకున్నాదు రాయుడు.

“దొరా! వేళయిపోయింది. గింజలిప్పించండి” బుట్టలో పాముమ కప్పెదుతూ దొరకేసి దణ్ణం పెట్టాడురంగడు.

"అవున్నా. నీకు పెళ్ళెప్పుడైంది" అడిగాడు రాయుడు.

"నెల రోజులైంది దొరా! ఇదే నా పెళ్లాం యెంకి" ఎందుకో సిగ్గుపడ్డాడు రంగడు.

"అలాగా! మంచిపెళ్ళాన్నే పట్టావ్"

ఈసారి గర్వపడ్డాడు రంగడు.

దొర ఇచ్చిన గింజలు తీసుకుని వెళ్ళిపోయాడు రంగడు. ఎంకి వాడిని అనుసరించింది.

పాములుపట్టడం రంగడి వంశపారంపర్య వృత్తే అయినా దానిమీదే ఆధారపడలేదు వాడు. మామూలుగా కూలిపనికి పోతుంటాడు. అప్పుడప్పుడు పాములు పట్టి ఆడిస్తుంటాడు.

రాయుడికి ఆ రాత్రి నిద్ర పట్టలేదు. అసలు ఏ పిల్లమీద మనసుపడినా ఆ పిల్లను పొందేదాకా రాయుడికి నిద్రపట్టదు.

ఆ ఊరికి మకుటంలేని మహారాజు రాయుడు. వందెకరాల మాగాణీవున్న భూస్వామి. అహంకారం, దర్పం, నిరంకుశత్వం అతని నరాల్లో జీర్ణించుకుపోయాయ్.

మర్నాడు రాయుడు ఎర్రబారిన కళ్ళతో నిద్ర లేచాడు అనేకంటే మంచం దిగాడు అంటేనే బాగుంటుంది. రాయుడిదంతా ముక్కుసూటి వ్యవహారం. మనసుపడ్డ ఆడదాన్ని ఏ పొలంగట్టునో, గడ్డివాము చాటునో చెయ్యి పట్టుకుంటాడు. రాయబారాలు వుండవు. అందుకనే సాధారణంగా ఆడవాళ్ళెవరూ రాయుడి కంటపడరు.

మధ్యాహ్న సమయాన రంగడి గుడిసె తలుపు తట్టాడు రాయుడు. తలుపుతీసిన ఎంకి రాయుడ్ని చూసి తత్తరపడింది. ఆయన చూపులు ఆమెకు భయం పుట్టించాయి.

"మా మావ లేదు దొరా!" అంది భయంగా, వినయంగా.

"నేనొచ్చింది నీకోసమే చిలకా! వాడు లేకపోతే మరీ మంచిది" మీసాలు మెలిపెడుతూ గుడిసె లోపలికి అడుగేశాడు రాయుడు డైరెక్టుగా రంగంలోకి దిగుతూ.

"దొరా! తప్పు దొరా! నేనలాంటిదాన్ని కాను దొరా!" చేతులు జోడిస్తూ గుడిసెలో ఒకమూలకు వొదిగింది ఎంకి.

"అబ్బా! ఈ మాటలు వినివిని విసుగు వేసింది. మర్యాదగా నా మాట విను. నువ్వు అరిచి గీపెట్టినా ఇక్కడికెవ్వడూ రాడు" అంటూ ముందు కదుగేశాడు రాయుడు.

"దొరా ముందుకొస్తే పానాలు దక్కవ్' గద్దించింది ఎంకి.

"ఏంటే! ఉన్నట్టుండి అంత ధైర్యం వచ్చింది" మరింత ముందుకదుగేశాడు రాయుడు.

ఎంకి గబుక్కున వంగి మూలనున్న బుట్ట ఎత్తుకొని మూతతీసి రాయుడి ముందుకొచ్చింది. 'బుస్'మంటూ పడగ విప్పి నిలబడింది కోడెనాగు.

ఒక్క క్షణం తొట్రుపడ్డాడు రాయుడు. మరుక్షణం రాయుడి చెయ్యి మెరుపుకంటే వేగంగా కదిలి నాగు మెడను ఒడిసి పట్టుకొంది. దాన్ని అలాగే మరింత బిగించాడు. తోకతో రాయుడి చేతిని పెనవేసుకుంది నాగు. కొద్దిసేపటి తర్వాత పట్టు సడలి వేలాడసాగింది. కొనవూపిరితో ఉన్న దానిని

మరో మూలకు విసిరేశాడు.

ఆ దృశ్యం చూసి కొయ్యబారి పోయింది ఎంకి. పాములోడి కంటే లాఘవం గా ఆ నాగును లొంగదీసిన రాయుడ్ని చూసి ఆమె బిత్తరపోయింది.

విజయగర్వంతో మీసాలు మెలేశాడు రాయుడు.

"హు! వందెకరాల భూస్వామిని నేను. ఇలాంటి నాగుల్ని నా పొలాల్లో వందలు చూశాను. చంపాను. ఇదొక లెక్కా" అంటూ ముందుకురికి గబుక్కున కౌగలించుకున్నాడు ఎంకిని. ఎంకి పెనుగులాడసాగింది.

అంతలో వాకిలిదగ్గర అలికిడై ఎంకిని వదిలి వెనక్కి తిరిగాడు రాయుడు. వాకిట్లో రంగడు నిలబడివున్నాడు. రంగడికి అక్కడి పరిస్థితి అర్థమైంది.

రాయుడి చెయ్యి మీసాలమీదికి వెళ్ళింది. "మరోసారి వస్తా"నంటూ వెళ్ళిపోయాడు గంభీరంగా.

రంగడి రక్తం సలసల మరిగింది. కానీ ఆ వెంటనే రాయుడి సంగతి గుర్తొచ్చి వణుకు పుట్టింది. ఏమి చేయాలో పాలుపోలేదు వాడికి. ఎదురు తిరిగినవాడి శవం కూడా కనిపించకుండా చెయ్యగల సమర్థుడు రాయుడని వాడికి తెలుసు.

ఆ రాత్రి రంగడు, ఎంకి ఏడుస్తూ గడిపారు. మళ్ళీ రాయుడు ఎప్పుడు వస్తాడోనని ఎంకి బిక్కుబిక్కు మంటూ గడపసాగింది.

సరిగ్గా నాల్రోజుల తర్వాత —

ఎంకి ముందు ప్రత్యక్షమయ్యాడు రాయుడు మీసాలు దువ్వుకుంటూ.

"రా దొరా! రా!" ఆహ్వానించింది ఎంకి.

"ఏంటేయ్! నాల్రోజుల ముందు బుసలు కొట్టినదానివి ఇయాల ఇలా మారిపోయావ్. ఏంటి కథ?" వంకరగా నవ్వుతూ అడిగాడు రాయుడు.

"మీ బోటివాళ్ళను ఎదిరించి బతకడం



కట్టమని తెలుసుకున్నాను దొరా! ఆయాల అట్టా చేసినందుకు నన్ను సెమించు దొరా! మా మామ కూడా ఇదే చెప్పమన్నాడు" అంది ఎంకి పశ్చాత్తాపపడుతూ.

"ఆహా! అలాగా! ఏమైనా రంగడు తెలివిగలోడే!" మలక మంచంమీద కూర్చుంటూ అన్నాడు రాయుడు. ఎంకి రాయుడి పక్కనే కూర్చుంది నవ్వుతూ. ఇక ఆగలేక పోయాడు రాయుడు. పక్కకు తిరిగి అమాంతం ఎంకిని కౌగలించుకున్నాడు.

"అబ్బా!" చిన్నగా అరిచింది ఎంకి.

"ఏమైంది?" అడిగాడు రాయుడు.

"నిన్న కూరగాయలు తరుగుతుంటే కత్తిపీట తెగింది దొరా!" అంటూ కుడిచేతి చూపుడువేలు ముందుకు చాపింది ఎంకి. చిన్నగుడ్డ పేలికతో వేలికి కట్టు కట్టుకొని వుంది.

"ఓస్! దానికేనా!" తేలిగ్గా అన్నాడు రాయుడు.

"దొరా! నాదో చిన్న కోరిక" గారాలు పోయింది ఎంకి.

"అదుగే! తీరుస్తాను" అన్నాడు రాయుడు ఎంకి పాలిండ్ల వంక ఆబగా చూస్తూ.

"మా మావకి ఒక అరెకరా పొలం కౌలుకిప్పించు దొరా!"

"అలాగేలే! అంతేనా... ఇంకేమన్నా వున్నాయా?"

"ఇంకేమీ లేవు దొరా!" ఒళ్ళు విరుచుకుంది ఎంకి.

రాయుడి కళ్ళు కామంతో ఎరుపెక్కాయి. పెదాలు తడుపుకున్నాడు నాలుకతో. వెంటనే ఎంకిని వాటేసుకుని ఆమె మీదకు వంగాడు.

"అబ్బా! వుండు దొరా!" అంటూ తన ముఖంమీదకి వస్తున్న రాయుడి పెదాలకు చెయ్యి అడ్డంపెట్టింది ఎంకి.

రాయుడి పెదాలు చురుక్కుమన్నాయి. పెదాలమీది ఎంగిలిలో ఏదో కలిసి నల్లనిపించింది. ఏదో అర్థమవుతున్నట్టు అతని కళ్ళు పెద్దవయ్యాయి.

ఎంకి లేచి నిలబడి వేలికి చుట్టుకునివున్న గుడ్డను తీసి దూరంగా విసిరింది. అది కాలకూట విషంలో తడిపి ఎండిన గుడ్డపేలిక

రాయుడి పెదాల్లోకి చేరిన విషం రక్తంలోకి ప్రవేశించి భగ్గుమంది.

"మోసం! దగా!" అంటూ రాయుడు కింద పడి గిలగిలా కొట్టుకోసాగాడు.

ఎంకి విరగబడి నవ్వడం మొదలుపెట్టింది.

రాయుడి కళ్ళకు ఎంకి ఎంకిలా కనపడ్డం లేదు. పడగెత్తి నాట్యం చేస్తున్న అందమైన నాగులా కనిపిస్తోంది.